కథ

యల్లాప్రగడ సువర్చలాదేవి

# స్వయంకృతం

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఓ చిన్నపాటి కుదుపుతో ఆగింది విశాఖ రైల్వేస్టేషన్‌లో. ఎవరికి వారు తామే ముందు దిగాలని తొందరపడుతున్నారు. కూలీల అరుపులతో 'అప్పుడే స్టేషన్ వచ్చేసిందా' అని బద్ధకంతో వళ్ళు విరుచుకొంటూ లేచింది రాధిక. జనాల తొందరలో చెల్లాచెదురైన చెప్పులను వెతుక్కొంటూ ఓ కూలీని పిలిచి వరుసగా పనులు పురమాయించసాగింది.

''ఆ పిల్లోలో గాలి తీసి బెడ్‌షీట్‌ని మడతపెట్టి ఆ బ్యాగ్‌లో పెట్టు. ఆ సూట్‌కేస్‌కి వేసిన చైన్ తాళం చెవి ఇదిగో. ఆ తాళం తీసి ఆ తాళాన్ని, చైన్‌ని సైడ్ జిప్‌లో పెట్టు. ఆ పైన తగిలించి ఉన్న కవర్‌ని జాగ్రత్తగా బ్యాగ్‌లో పైన పెట్టు అందులో పళ్ళున్నాయి, జాగ్రత్త. ఆ వాటర్ బాటిల్‌ని ఆ బ్యాగ్‌కున్న సైడ్ పాకెట్‌లో పెట్టు'' అతని జీవితంలో ఇన్ని పనులు చెప్పినవాళ్ళని ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు.

''హాయ్ రాధీ'' అన్న స్నేహితురాలి పిలుపు వచ్చినవైపు చూసి ''హాయ్ హరీ'' అంటూ చేతులు పట్టుకొని ఊపేసింది.

గంజి పెట్టిన కాటన్ శారీ, మ్యాచింగ్ బ్లౌజు, తలంటు పోసుకొని వదులుగా వేసుకొన్న జడ, నుదుటిపై బొట్టు దాని కిందా పాపిట్లో దేవుని కుంకుమ, మెళ్ళో నల్లపూసలతో పదహారణాల తెలుగింటి ఆడపడుచులా గౌరవం ఉట్టిపడేలా ఉంది హరిణి.

''వావ్! మిసెస్ ఆంధ్రాలాగా ఉన్నావే అంది'' స్నేహితురాల్ని మెచ్చుకోలుగా.

''నువ్వు మోడ్రన్ సత్యభామలానే ఉన్నావులే'' అంది జీన్ ప్యాంట్, హాఫ్ హ్యాండ్స్ షార్ట్ టాప్‌తో భుజాల దాకా కట్ చేసి వదులుగా వదిలేసిన జుట్టును వెనక్కి తోసుకుంటోన్న రాధికని నిశితంగా చూస్తూ.

''ఎక్కడ దించమంటారమ్మా'' అన్న పోర్టర్ ప్రశ్నే స్నేహితురాళ్ళ కబుర్లకు అడ్డుకట్ట వేయగలిగింది.

అక్కడ కారు పార్కింగ్ దగ్గరికి వెళ్ళాలని చూపించింది హరిణి.

''ఏంటే అనవసరంగా మీ హజ్బెండ్‌ని గానీ ఇబ్బంది పెట్టలేదు కదా పాపం'' అంది.

చిన్నగా నవ్విన హరిణి తనే కారుడిక్కీ తెరిచి పోర్టర్‌చే సామాను పెట్టించి, పోర్టర్‌కి డబ్బిచ్చి పంపించి కారుడోర్ తీసి రాధికని ఎక్కమంది. ఒకవైపు జరుగుతున్న సంఘటనలకి ఆశ్చర్యపోతోన్నా మరోవైపు పోర్టర్‌కి హరిణి ఎక్కువ డబ్బులిచ్చిందని గొణుగుతూనే ఉంది రాధిక. ''పోనీలేవే ఈ రోజు నీ పేరు చెప్పుకొని అతను సంతోషంగా ఉంటాడులే'' అని కారుని ముందుకి పోనిచ్చింది హరిణి.

''అయినా నువ్వెప్పుడు కారు నేర్చుకొన్నావే.



ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన

జాగ్రత్తగానే తీసికెళ్తావుగా'' ఆట పట్టించింది రాధిక.

''నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు సరేనా. అయినా నా మీద నమ్మకం లేకపోతే మా ఆయన నాకు కారిచ్చి పంపరు కదా! అసలు నాకూ స్కూటీ మీద వెళ్ళడం హాయి కానీ నువ్వు లగేజీతో ఉంటావు కదా అందుకే ఆయనే కారు తీసుకెళ్ళమన్నారు'' చెప్తోంది హరిణి.

''మరి నిన్నొక్కదాన్నీ పంపకపోతే ఆయన కూడా రావొచ్చుగా నీకు తోడుగా'' గడుసుగానే అడిగింది రాధిక.

''రావొచ్చు కానీ మీ స్నేహితురాళ్ళిద్దరూ చాలా సంవత్సరాలకి కలుస్తున్నారుగా మీ మధ్యలో నేనెందుకు అడ్డుగా. ఏమైనా ప్రాబ్లం ఉంటే ఓ ఫోన్ కొట్టు క్షణాల్లో వాలతాను అన్నారు'' నవ్వుతూ చెప్పింది హరిణి.

ఎక్కడో మనసులో ఓ మూల చిన్న జెలసీ లాంటిది కలిగింది రాధికకి. ఒక్కసారిగా తనకి భర్త శ్రీహర్ష గుర్తొచ్చాడు. మధ్య తన ఊరి ప్రయాణ విషయంలో జరిగిన సంభాషణ చెవుల్లో మారుమోగుతూనే ఉంది.

''అసలు నువ్విప్పుడు పనిపాటా లేనట్టు పాత స్నేహితురాళ్ళని కలవడానికి అంత దూరం ఎందుకెళ్తున్నట్టు?'' హరిణిని కలవడానికి వెళ్తున్నానని మొదటిసారి చెప్పినప్పుడు అది అతని రియాక్షన్.

''అయినా నేనున్నా లేకపోయినా మీకొచ్చిన నష్టం ఏమిటి? మీ పనులు మీకుంటాయిగా'' నిరసన తెలిపింది.

ఇది మాటల్తో తేలే వ్యవహారం కాదులే అని ''మన ట్రావెల్ ఏజెంట్‌కి ఫోన్‌చేసి ఫ్లైట్ బుక్ చేయమని చెప్పు'' అని ఓ ఉచిత సలహా పడేసి తనకో బిజినెస్ మీటింగ్ ఉందని చెప్పి తను బాంబే వెళ్ళిపోయాడు. వర్షాల వల్ల వైజాగ్ ఎయిర్‌పోర్టులో లాండింగ్ సమస్య అని ఫ్లైట్ రద్దవడంతో రైల్లో బయలుదేరింది తను.

''ఇదే నే మా చిన్న కుటీరం'' అంటూ గేట్ దగ్గర కారు ఆపి దిగి, గేటు తీసి కారు లోపల పెట్టింది. నిజంగానే ఆ ప్రదేశం అద్భుతంగా ఉంది. కారు మాత్రం పట్టే ఓ చిన్న గేటు, గేట్ నుండి పోర్టికోకి చిన్నదారి, దారికి ఒక వైపు అందమైన పూల మొక్కలు, మరో వైపు ఆకుపచ్చని లాన్. ''వావ్.. బ్యూటిఫుల్. చాలా బాగుందే ఈ వాతావరణం'' మనస్ఫూర్తిగానే అంది రాధిక. ''ఏదో లేవే! మా ఇద్దరి అభిరుచులకు అనుగుణంగా ఇలా చేసుకున్నాం'' అంటూనే ఎదురుగా వచ్చిన భర్తని పరిచయం చేసింది. ''ఇదుగోనే మా శ్రీవారు, ఇదేనండి నా ప్రాణ స్నేహితురాలు రాధిక'' అంది.

''హలో! అయాం నివాస్. ప్రయాణం బాగా జరిగిందా? మీ వారు కూడా వస్తే బాగుండేది'' అంటూ హరిణి చేతిలోని సూట్‌కేసుని, బ్యాగ్‌ని తీసుకొని లోపలికి దారితీసాడు.

'మనిషే కాదు మనసూ అందంగానే ఉంది' అనుకుంది రాధిక వారి పెళ్ళికి తను అమెరికాలో ఉండి రాకపోవడం చేత అప్పుడే మొదటిసారిగా చూస్తుండటంతో. ఆమె భావాలను గమనించిన హరిణి ''ఏంటి మా ఆయనకి దిష్టి పెడుతున్నావ్!'' అంది.

''అబ్బా! అదేం లేదే, అయినా మీవారు వింటే ఏమనుకుంటారు'' అంది రాధిక చిరుకోపంతో.

''ఫర్లేదులేవే. ఆయనేం అనుకోరులే. పద లోపలికి'' అంది హరిణి.

చిన్న ఇల్లులాగే ఉన్నా ఒక్కో గది ఎంతో అందంగా పొందికగా తీర్చి దిద్దినట్టు ఉంది.

ఆ ఇంట్లో దేన్ని చూసినా కళ్ళు తిప్పుకోలేకపోతోంది రాధిక.

''గుడ్‌మార్నింగ్ ఆంటీ'' అంటూ తెల్లని యూనిఫార్మ్‌లో నీట్‌గా తయారయి ఉన్న ఇద్దరు ముద్దులొలికే చిన్నారులను చూసి ఆశ్చర్యపోయింది రాధిక. అంత ఉదయమే లేచి తయారయిపోయి ఎంత ఫ్రెష్‌గా ఉన్నారు. తన పిల్లల్ని ఎంత లేపినా లేవరు, లేచినా వాళ్ళని తయారుచేసి పంపించడమే ఓ పెద్ద సవాల్. అయినా అవన్నీ తన వల్ల కాకే పని పిల్లకి అప్పగించేసింది.

''మీ పని పిల్ల బానే తయారు చేసేసిందే మీ పిల్లల్ని'' అంది పిల్లల్ని విష్ చేశాక హరిణితో.



''పని పిల్ల ఎవరూ. వాళ్ళే తయారయ్యారు. వాళ్ళ నాన్న కాస్త హెల్ప్ చేసి ఉంటారు'' అంది హరిణి.

''వీళ్ళని ఆయన తయారు చేశారా?''

''సాధారణంగా వాళ్ళే తయారవుతుంటారు. వాళ్ళకి ఏమైనా సహాయం కావాలంటే నేనో ఆయనో ఎవరో ఒకరు వెళ్తుంటాం. అలానే వాళ్ళకి చిన్నప్పటినుంచీ ట్రైనింగ్ ఇచ్చాము'' అంటూ భర్తకి, పిల్లలకి క్యారేజీలు సిద్ధం చేసింది హరిణి. పది గంటలకల్లా నివాస్, పిల్లలు వెళ్ళిపోయారు. హరిణి తన పనంతా ముగించుకొని వచ్చేలోగా రాధిక కూడా స్నానం చేసి బ్రేక్ ఫాస్ట్ కూడా కానీయడంతో స్నేహితురాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు.

హరిణి ఆ దగ్గరలోని ఓ కాన్వెంటులో పని చేస్తోంది. స్నేహితురాలు వస్తోందని ఆ రోజు శెలవుపెట్టింది. ఇద్దరూ కలిసి కాస్త కాస్త సేపు ఇంట్లో, మేడ మీద, వాకిట్లో, తోటలో కబుర్ల కాలక్షేపం చేసారు. మధ్యాహ్నం భోజనం తర్వాత హరిణి తన హాండ్ వర్క్ కలెక్షన్, తను పిల్లలకు తీసిన ఫోటోలు చూపించింది. సాయంత్రం ఇద్దరూ స్కూటీపై బయట తిరిగారు. కాసేపు బీచ్‌లో కూర్చొన్నారు. కాలేజీ

## ఇదేమైనా బావుందా?

**ఐపియల్‌లో తలపడుతున్న చెన్నయ్ సూపర్ కింగ్స్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎన్నికైన నయన తారని ఇప్పుడా కాంట్రాక్టు నుంచి తొలగించివేసారు జట్టు మేనేజ్‌మెంట్. అసలామె టీం ప్రచారానికి ఎలాంటి ఆసక్తి కనబరచకపోవడమే దీనికి కారణమట. తనని ఇలా తొలగించిన సంగతి పత్రికల ద్వారానే తనకి తెలిసిందని, తనకి ఎలాంటి ఇంటిమేషనూ లేదని, తన అనారోగ్య కారణంగా హాజరు కానంత మాత్రానా ఇలాంటి నిర్ణయం తీసుకోడం బాలేదని వాపోయింది నయనతార. ఆమె సంగతెలా వున్నా నయనతారకి బదులుగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఇప్పుడా పొజిషన్ని త్రిష కొట్టేసిందిట.**

సంగతులు, ఇతర స్నేహితురాళ్ళ సంగతులు, లెక్చర ర్లపై జోకులూ గుర్తుచేసుకొంటూ వేడి వేడిగా మొక్కజొన్న పొత్తులు, వేయించిన వేరు శెనగ కాయలు తింటూ సరదాగా గడిపారు.

ఆ రాత్రి భోజనాల సమయంలో ''మీ స్నేహితు రాలి రచనలేమైనా చదివారా మీరు?'' అడిగాడు నివాస్.

''ఏంటే నువ్వు రాస్తావా. చెప్పనేలేదు'' అంటూ ఆశ్చర్యపోయింది రాధిక.

''ఏదో సరదాగాలేవే. అదీ అప్పుడప్పుడు ఆయన బలవంతం మీదే'' సిగ్గుపడింది హరిణి.

''కాదాంటీ అమ్మ బాగా రాస్తుంది. ఇదిగో చూడండి'' అంటూ హరిణి రచనలన్నీ తెచ్చి చూపించారు పిల్లలు.

ఆ రోజంతా సరదాగా గడిచినట్టుంది రాధికకి. హరిణి జీవితం అంతా ఓ కలలా కనిపిస్తోంది రాధి కకు. అర్థం చేసుకొని సహకరించే భర్త, ముత్యా ల్లాంటి పిల్లలు, అందమైన పూలవనంలాంటి ఇల్లు, సమాజానికి తన వంతు ఓ బాధ్యతగా గౌరవప్రద మైన అధ్యాపక వృత్తి, కాలక్షేపానికి రచనా వ్యాసంగం లాంటి ఓ మంచి అలవాటు. ఎందరో ఆడవాళ్ళు కోరుకునే ఓ అపురూపమైన జీవితం హరిణిది. తన కిది ఎలా సాధ్యపడింది? కాలేజీలో తను సామా న్యంగా ఉండేది. చదువులో, ఆటపాటలు, నాట కాలు, నృత్యాలు, వక్తృత్వ పోటీలు ఇలా అన్నింట్లో తనే ముందు ఉండేది. ఒక్క వ్యాస రచన పోటీల లోనే తన హరిణిది పై చేయి. అదీ తనకి ఇంట్రస్ట్ లేక వదిలేసింది కానీ లేకపోతే అక్కడా తనదే పై చేయి అని తను భావించేది. ప్రతి సంవ త్సరం కాలేజీలో జరిగే మిస్ కాలేజ్ పోటీల్లో కూడా తనదే హవా. కాలేజ్ ఎలక్షన్, ఏదైనా సమస్య పై జరిపే ఉద్యమాలు అన్నింట్లో తనే ముందుండేది. అలాంటిది ఇప్పుడు జీవి తంలో హరిణి తనకన్నా ముందున్నట్టు కనప డుతోంది. నిజానికి తనకేం తక్కువ? తనకీ భర్తా, పిల్లలు, ఖరీదైన కార్లు, బంగళాలు, పెద్ద ఉద్యోగం, డబ్బు అన్నీ ఉన్నాయి. కానీ లేన ట్టుగా కనపడుతున్నదల్లా తృప్తి, మనశ్శాంతి.

తనది, తన భర్త శ్రీహర్షది లవ్ మ్యారేజి. కానీ ఇప్పుడు ఇద్దరికీ ఒకరికొకరు సమయం కేటాయించుకోలేనంత బిజీ జీవితం. తమ మధ్య వచ్చిన ఈ అంతరానికి కారణం కేవలం బిజీ షెడ్యూళ్ళేనా? ఆ మాటకొస్తే ఈ రోజుల్లో ఎవరు మాత్రం బిజీగా లేరు? హరిణి, నివాస్ మాత్రం బిజీ కాదా? కానీ వాళ్ళు ఆనందంగా లేరా? నివాస్ కూడా మంచి ఉద్యోగంలోనే ఉన్నాడు. సొంత ఇల్లు, కారు, పిల్లలు మంచి స్కూళ్ళలో చదివించగ లగుతున్నాడంటే అతనిదేమీ కాలక్షేపం ఉద్యోగం కాదుగా! అంతేకాదు ఇంట్లో హరి ణికి సహాయం చేస్తుంటాడట, పిల్లలనీ పట్టించు కొంటుంటాడట. మరి శ్రీహర్ష? ఇంట్లో ఏమీ పట్టించుకోడు. డబ్బు సంపాదించడం ఒక్కటే తన ధ్యేయమనుకొంటాడు.

'కారణం మొత్తం శ్రీహర్ష మీదకి నెట్టేస్తున్నావ్. అంటే నీ తప్పేం లేదా? తప్పంతా అతనిదేనా?' తన అంతరాత్మ నవ్వుతున్నట్టుగా అనిపించింది. రాధిక ఉలిక్కిపడింది. మొట్టమొదటిసారి తనలోనూ కొన్ని లోపాలున్నట్టు అనిపించసాగింది. మరో పక్క తన అహం ఒప్పుకోవడంలేదు. ఒక్కసారి ఆమె దృష్టి హరిణి జీవితంపైకి మళ్ళింది. హరిణి ఇంటి పనులన్నీ చేసుకొంటుంది, ఉద్యోగం చేస్తోంది. తను చేసే ఏ పని వలన మరో పనికి ఇబ్బంది కలగ కుండా చూసుకోగలుగుతుంది. అందుకనేనేమో ఆమెకి భర్త తోడ్పాటు, పిల్లల సహకారం. ఇంకా తన మనసులో ఏదో అలజడిగానే ఉంది. హరిణి రాకతో కాసేపు ఆలోచనల తేనె తుట్టెను పక్కకి నెట్టింది.

''ఏంటే ఒక్కదానివే పడుకొని ఆలోచిస్తు న్నావ్? నా రచనలన్నీ బోరు కొట్టిస్తు న్నాయా?'' అడిగింది హరిణి.

రాధిక కాసేపు తన బాధని స్నేహితురాలితో పంచుకోవాలనుకుంది. అంతలోనే అహం అడ్డొచ్చి చెప్పలేకపోయింది. ఏదో ఒకటి మాట్లా డలని ''నీ రచనా వ్యాసాంగం గురించి చెప్పవే. అసలు ఎప్పుడు మొదలైంది? ఎలా మొద లైంది?''



కాస్త సిగ్గు, ఆనందం కలగలిపిన భావాలతో చెప్పింది హరిణి ''పెళ్ళయి పిల్లలు పుట్టి వారు కాస్త పెరిగే వరకూ నేనూ రాయగలనని కూడా అనుకో లేదు. దాదాపు మూడేళ్ళ క్రితం ఓ రోజు అంటే మేము ఈ ఇంట్లోకి మారబోయే ముందు ఇల్లు సర్దుతూ ఉంటే ఎప్పుడో కాలేజీలో వ్యాస రచన పోటీలో గెలుపొందినపుడు నాకు వచ్చిన ప్రశంసా పత్రం మావారి కంటపడింది. స్వతహాగా మంచి రీడర్ అయిన ఆయనకి ఇది చాలా ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అనిపించి అడిగారు. ఏదో కాలేజీడే స్‌లో సరదాగా రాసేదాన్ని అని చెప్పడంతో ఈ ఇంట్లోకి రాగానే నాకో రైటింగ్ టేబుల్, ప్యాడ్, టేబు ల్‌లైట్, తెల్ల కాగితాలు, మంచి పెన్ను ఇలా స్టేషనరీ అంతా కొని నీట్‌గా అరేంజ్ చేసి నేను రాయాల్సిందే నని నన్ను ప్రోత్సహించారు. అంతేకాదు నా టేబు

## మోనిక గోడు!

**బాలీవుడ్ నటి మోనికా బేడీ-డాన్ అబూస లేంతో కలిసి పోర్చుగల్ పారిపోవడం, తర్వాత ఎలా గైతేనేం ఇండియాకి రావడం, హైదరాబాదు, భోపాల్ కోర్టుల్లో కేసులు నడవడం అందరికీ తెలుసు. ప్రస్తుతం పంజాబ్‌లో విశ్రాంతి తీసుకుం టున్న మోనిక త్వరలోనే తన సొంత కథతోనే సినిమా తీయాలని భావిస్తోందిట. అయితే అబూస లేంగా నటించడానికి ముందుకొచ్చే హీరోయే దొర కడం లేదట. సల్మాన్ ఖాన్‌ని కూడా ట్రయ్ చేసిం దిట. కానీ అతను నో చెప్పేసాట్ట. హీరో దొరగ్గానే మోనిక తన జీవిత గాథని సినిమాగా రూపొందిస్తుం దట.**

ల్‌పై రైటర్ హరిణి అని ఓ నేం ప్లేట్ కూడా పెట్టారు. ఆయన ముచ్చట తీర్చడంకోసం అన్నట్లు చిన్న చిన్న వ్యాసాలతో మొదలుపెట్టాను. ఆయనే వాటిని చదవటం, తన అభిప్రాయాలు చెప్పడం, పత్రికలకి పంపడం లాంటివి చేసేవారు. మొట్టమొదటిసారి నా వ్యాసం పత్రికలలో పడ్డ ప్పుడు ఆయన ఆనందాన్ని నేను ఇప్పటికీ మర్చిపో లేను. ఓ పెద్ద పండగలా చేసారు ఆరోజు. నా విజ యానికి ఆయన పొందే ఆనందం, సంతృప్తే రచ యిత్రిగా నన్ను ముందుకు తీసుకెళ్తున్నాయి..నా గురించే ఎక్కువగా చెప్పి నిన్ను విసిగిస్తున్నానా?'' అంది హరిణి.

''లేదే. నీ లైఫ్ గురించి వింటుంటే నాకూ చాలా ఆనందంగా, ఎంతో ఇంటరెస్టింగ్‌గా ఉంది. మొత్తానికి నీ విజయం వెనుక నీ శ్రీవారు ఉన్నార న్నమాట. వెరీ గుడ్''

''మరి నీ విజయం వెనుక మీ వారు లేరా? అన్నట్లు నీ గురించే ఏమీ చెప్పలేదు. నీ లైఫ్ ఎలా

సాగుతోంది? మీది లవ్ మ్యారేజ్ కదా! మా కన్నా మీ లైఫ్ ఇంకా బాగుండే ఉంటుంది''

రాధిక మొహంలో క్షణకాలం పాటు ఆనందం ఆవిరైనట్టు అనిపించింది. నిజం చెప్పి దానిని బాధ పెట్టటమా? ఇంత మంచి స్నేహితురాలివద్ద అబద్ధం చెప్పటమా? ఎక్కువ సేపు మౌనంగా ఉంటే రచయిత్రి కూడా అయిన తన స్నేహితురాలు ఎక్కడ అర్థం చేసుకొంటుందో అని చివరికి నిజాన్ని దాయటమే ఓ నిర్ణయానికి వస్తూ అంది ''నాదేముందే అంతా రొటీన్. ఎవరి లైఫ్‌లో వాళ్ళు బిజీ అందుకే కదా కాస్త ఛేంజ్‌కోసం ఇలా వచ్చింది! అయినా రేపు ఏమిటే ప్రోగ్రాం'' అంటూ టాపిక్‌ని మార్చింది రాధిక. హరిణి కూడా స్నేహితురాలిని మరిక ఈ విషయంలో ఏమి అడగకుండా వేరే సంగతులతో కాలక్షేపం చేసింది.

మరుసటి రోజు ఉదయం ఎనిమిదిన్నర అవుతుంటే మెలకువ వచ్చింది రాధికకి. కాసేపు పడుకుందాములే అనుకొంది కానీ బయట ఏవో చప్పుళ్ళు, జనం హడావిడిగా తిరుగుతున్నట్లు అనిపించి గది బయటికి వచ్చి చూసింది. అప్పటికే నివాస్, పిల్లలు తయారై ఏవో వస్తువులను కార్లో పెడుతున్నారు. నివాస్ కారు డిక్కీలో సామానులు సర్దుతున్నాడు. హరిణి వంటింట్లో ఏదో చేస్తోంది.

''ఏంటే హడావుడి'' అడిగింది రాధిక.

స్నేహితురాలి తత్వం తెలిసిన హరిణి ''నిన్నే చెప్పాను కదే పిక్నిక్‌కి వెళ్తున్నాం అని. నీ నిద్ర అయిపోతే రెడీ అవ్వు. ఈలోగా నేనీ వంటింట్లో పనులను పూర్తి చేసేస్తాను'' అంది.

ఉదయం తొమ్మిదిన్నర అవుతుంటే అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు బ్రేక్ ఫాస్ట్‌కోసం. అక్కడా రాధికదే లేటు. రాధిక స్నానం చేసి వచ్చేటప్పటికి హరిణి మొత్తం వంట పనిపూర్తి చేసి డైనింగ్ టేబుల్‌పై నీట్‌గా టిఫిన్ సర్ది వెయిట్ చేస్తోంది. పిక్నిక్‌కి తీసుకెళ్ళే వస్తువులు, తిండి పదార్థాలు, ఆటవస్తువులతో సహా కారులో సర్దేసి అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని రాధిక కోసం వెయిట్ చేస్తున్నారు. తనే లేట్ అని గిల్టీగా ఫీలైన రాధిక సారీ చెప్పింది.

''పాపం మొన్న రాత్రి కూడా మీకు రైల్లో నిద్ర సరిగ్గా ఉండి ఉండదు. మా గడుగ్గాయిలు అల్లరితో మిమ్మల్ని త్వరగా నిద్రలేపినట్టున్నారు. వాళ్ళ తరపున నేనే మీకు సారీ చెప్తున్నాను'' అన్నాడు నివాస్.

అతని మాట తీరు, గొంతులోని సౌమ్యం ఆమెని కట్టిపడేసింది. నిండైన విగ్రహం, ఆకట్టుకొనే రూపం, చక్కని ప్రవర్తన ఆమెని చూపు తిప్పుకోకుండా చేశాయి. స్నేహితురాలి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి ''ఆ.. ఏంటే..'' అడిగింది. అప్పటికే హరిణి, నివాస్ ఒకరివైపు ఒకరు చూసుకొని ముసిముసిగా నవ్వుకోవడం రాధిక కంటపడి సిగ్గుతో తల ప్లేట్లో పెట్టేసింది. ఉప్మా, పెసరట్టు, కొబ్బరి చెట్నీ అద్భుతంగా టిఫిన్. తను రోజూ తినే బ్రెడ్, జాం దీని ముందు ఎందుకు పనికొస్తుంది అనిపించింది.

పది గంటలకు అందరూ బయలుదేరారు. వెనక సీట్లో స్నేహితురాలి పక్కనే కూర్చొంది రాధిక. ముందు సీట్లో నివాస్ పక్కనే వాళ్ళ అబ్బాయి ఏడేళ్ళ తేజ, వెనుక సీట్లో హరిణి పక్కన ఐదేళ్ళ వాళ్ళ అమ్మాయి అనన్య కూర్చొన్నారు. అందరి పిల్లల్లా వీళ్ళు అల్లరి చేయడం లేదు. హరిణి, నివాస్ వాళ్ళని కోప్పడటమూ లేదు. వారికి కావాల్సినవి అడిగి చేస్తున్నారు. అన్ని కుటుంబాలు ఇంత చూడముచ్చటగా ఉంటే ఎంత బాగుంటుందో కదా అనుకొంది రాధిక. దారి మధ్యలో కనబడే ప్రదేశాల గురించి హరిణి కుటుంబంలో ఎవరో ఒకరు రాధికకు ఉత్సాహంగా చెప్తున్నారు ఆ అందమైన ప్రకృతి, పచ్చని చెట్లు, చల్లని గాలి రాధికని మంత్ర ముగ్ధను చేస్తున్నాయి. ముందు చెమట పడుతుందేమో అని కారు డోర్స్‌కి ఉండే గ్లాసెస్‌ని మూసేసి ఏసీ ఆన్ చేశాడు నివాస్. కానీ కాసేపటికి ఆ సహజసిద్ధమైన వాతావరణానికి మరింత దగ్గరగా ఉండాలని ఏసిని ఆఫ్ చేసి గ్లాస్ డోర్స్ దించేసి కిటికీలోంచి బయటకు చూస్తూ చిన్న పిల్లలా అయిపోయింది రాధిక.

మధ్య మధ్యలో ''ఆంటీ ఇది చూడండి'' అని తేజా చూపిస్తుంటే ముందుకు వంగి మరీ చూసి ఆనందించింది రాధిక.

''పోనీ ముందుగానీ కూర్చొంటావే'' రాధిక ఆత్రాన్ని చూస్తూ, వస్తోన్న నవ్వుని ఆపుకొంటూ స్నేహితురాలికి మాత్రమే వినపడేలా కొంటెగా అడిగింది హరిణి. స్నేహితురాలి భావాన్ని అర్థం చేసుకొంటూ ''చాల్లేవే మరీనూ నువ్వు'' చిరుకోపం ప్రదర్శించింది రాధిక. కాలేజీ డేస్‌లో తమకి ఎవరైనా అబ్బాయిలు ఇంప్రెసివ్‌గా కనబడితే ఇలానే ఒకళ్ళనొకళ్ళు సరదాగా ఆటపట్టించుకొనేవారు. రాధికకి ఆ రోజులు గుర్తొచ్చి ఆనందంతో స్నేహితురాలి చేతిలో చేయి వేసింది.

ఓ అందమైన ప్రయాణం తరువాత మరింత సుందర ఉద్యానవనం లాంటి చోట కారాపాడు నివాస్. ''ఈ ప్రదేశాన్ని గోవిందపురం అంటారు. ఇక్కడ పార్థసారధి గుడి చాలా ఫేమస్'' అంటూ అక్కడి విశేషాలన్నింటినీ చెప్పాడు నివాస్. తరువాత ఆ దగ్గరలోని తోటలో ఓ మామిడి చెట్టు కింద పచ్చని గడ్డిలో జంపఖానా వేసి తమ వస్తువులన్నీ అక్కడ పరచి కాసేపు అక్కడ విశ్రాంతి తీసుకొన్నారు. కాసేపట్లో అక్కడ ఓ పెద్ద చెట్టుకొమ్మకి తాడు కట్టి, కూర్చోడానికి చక్కగా దుప్పటిని అమర్చి ఓ మంచి ఉయ్యాలను తయారుచేశాడు నివాస్. పిల్లలు కాసేపు ఊగి సరదా పడ్డారు. పిల్లలు ఊగుతున్నంత సేపు నివాస్ వాళ్లతోనే ఉండి వారికి కథలు, జోకులు చెబుతూ నవ్విస్తూ తనూ చిన్న పిల్లాడిలా ఆడాడు. కాసేపటికి ''నువ్వు కూర్చో డాడీ మేము ఊపుతాం'' అంటూ పిల్లలు ఇద్దరూ నివాస్‌ని కూర్చోపెట్టి ఊపి తమ సరదా తీర్చుకొన్నారు. నిజానికి తమ తండ్రిని కూడా తాము ఊపగలిగాం అని వాళ్ళు గర్వంగా ఆనందపడ్డారు. ఆ ఆనందమే నివాస్‌కి సంతృప్తినిచ్చింది.

''ఏంటే పెద్దవాళ్ళు కూడా ఊగొచ్చా? ఏం కాదా?'' అడిగింది రాధిక.


''ఏం నువ్వు కూడా ఊగుతావా? వెళ్ళి ఊగు'' అంది బ్యాగులోనుండీ ఏవో చిరుతిళ్ళు తీస్తూ హరిణి.

''నువ్వూ రావే. ఇద్దరం ఊగుదాం'' అంటూ మారాం చేసింది రాధిక.

''నేను ఇవన్నీ సర్దుతుంటాను గానీ నువ్వు వెళ్ళి ఊగుతూ ఉండు'' అంటూ అనన్యని పిలిచింది హరిణి.

''అబ్బా.. ఆయన ఉన్నారే.. నువ్వు రా'' అంటూ సిగ్గుపడుతూ హరిణిని లాక్కెళ్ళింది. రాధికకి అలవాటు లేకపోవడంతో సరిగ్గా కూర్చోలేక ''కాస్త పట్టుకోవే'' అని హరిణికి ఆర్డర్ వేసి ఊగబోతుంటే ఒక పక్కకి ఒరగబోయింది. రాధికతోటి ఉయ్యాలని కంట్రోల్ చేయలేకపోయింది హరిణి. వెంటనే ఉయ్యాల ఒక వైపు తాడు గబుక్కున నివాస్ అందుకోకపోయి ఉంటే కిందపడేదే. చివరికి దంపతులిద్దరూ ముసిముసిగా నవ్వుతూ ఊపారు.

కాసేపయ్యాక హరిణి తెచ్చిన చిరుతిళ్ళు తిని స్క్రాబెల్ ఆడారు ముగ్గురు. పిల్లలిద్దరూ ఏవో డ్రాయింగులు వేస్తూ వాళ్ళ ఆటల్లో వాళ్ళున్నారు. కాసేపు వన విహారం ఆ తర్వాత వన భోజనం చేసి కాసేపు నడుం వాల్చారు. ''ఇక ఇప్పుడు ఫిజికల్ యాక్టివిటీస్ ఏమీ చేయలేములే,



సరదాగా అంత్యాక్షరి ఆడదామా. ఏవండీ మా రాధి కాలేజ్‌లో సింగింగ్‌లో ఎప్పుడూ ఫస్ట్. ఎప్పుడు అంత్యాక్షరి ఆడినా నేనూ దాని గ్రూప్‌లో చేరిపోయే దాన్ని. కాబట్టి ఎప్పుడు మా టీందే విజయం'' ఉత్సాహంగా చెప్పింది హరిణి.

''అబ్బా చాలా రోజులయ్యిందే పాడి ఇప్పుడు నా గొంతు ఏమీ సహకరించడం లేదు'' మొహమాట పడింది రాధిక.

''తప్పదండీ. మీరు ఇప్పుడు పాడాల్సిందే. మా హరిణి మీ గురించి చాలాసార్లు చెప్పింది. మీ గొంతు వినే భాగ్యం మాకూ కలగాల్సిందే'' చొరవగా అన్నాడు నివాస్.

స్నేహితురాళ్ళిద్దరిదీ ఓ జట్టు. పిల్లలిద్దరూ, నివాస్ ఓ జట్టు. ముందు మొహమాట పడినా ఆట సాగే కొద్దీ రెట్టించిన ఉత్సాహంతో పాడింది రాధిక. నివాస్ కూడా అవతలి జట్టు నుండీ ఆమెకు దీటుగానే పాటల జవాబిచ్చాడు. ఈ సరదా పాటల పోటీకి కాలమే అడ్డుకట్ట వేయగలిగింది. కాస్త సాయంత్రం అవుతుండగా మకాం బీచ్‌కి చేరింది. పిల్లలలో పిల్లలుగా కలిసిపోయి అంతా కాసేపు క్రికెట్ ఆడారు. ఆటలో ఆనందాన్ని ఆస్వాదించారు. కాసేపు అలసిపోయాక ఇంటి నుండీ తెచ్చిన స్నాక్స్ తిని కాసేపు సముద్రపునీళ్ళతో ఆటలాడి సేదదీరి చీకటి పడుతుండగా ఇంటి దారి పట్టారు.

చాలాకాలం తర్వాత జీవితాన్ని జీవించినట్టనిపించింది రాధికకు. ఇన్నాళ్ళు తను ఎంత ఆనందాన్ని మిస్సయ్యానో కదా అని నిట్టూర్చింది. కారు వేగంగా ఇంటివైపు దూసుకెళ్తోంది. చల్లని గాలికి ముఖం మీద పడుతున్న ముంగురులను వెనక్కి తోసుకొంటూ వెనక్కి జారి ముందు సీట్లో రిలాక్స్డ్‌గా కూర్చొంది రాధిక. వెనుక సీట్లో తల్లి ఒడిలో తల పెట్టుకొని పడుకున్నారు పిల్లలిద్దరూ. కార్లోని మ్యూజిక్ సిస్టంని ఆన్ చేశాడు నివాస్. టేపులో నుండి కిషోర్ కుమార్ అమృతగానం చల్లని పిల్లగాలితో మమేకమై సుతారంగా ఆమె చెవులను తాకుతోంది 'ఛూ కర్ మెరె మన్ కో కియు తూనే క్యా ఇషారా' ఎంత హాయిగా ఉంది అనుకుంది రాధిక ప్రశాంతంగా పాట వింటూ వెనక్కివాలింది. ఆమె మనసు మరలా కాలేజీ రోజులకి వెళ్ళిపోయింది. ఆ రోజుల్లో కిషోర్ కుమార్ పాటలంటే చెవి కోసుకొనేది తను. ఓ క్లాస్‌మేట్ తనకి బర్త్ డే నాడు కిషోర్ కుమార్ పాటల క్యాసెట్‌ని గిఫ్ట్‌గా ఇచ్చాడు. తనకి ఆ రోజు ఎంతో సంతోషమేసింది. ఆ అబ్బాయి తనకి ఏ మాత్రం నచ్చినా అతని లవ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసి ఉండేది. కిషోర్ కుమార్ పాటల క్యాసెట్ అయితే ఇచ్చాడు గాని అతని లాంటి గాత్రం గానీ, రాజేష్‌ఖన్నాలాంటి రూపం గానీ లేక ఓకే చెయ్యలేకపోయింది. అతనికైతే నో చెప్పింది కాని ఆ పాటల క్యాసెట్‌ని మాత్రం ఎన్ని సార్లు విందో లెక్కే లేదు. అదే విషయం పై తన స్నేహితురాళ్ళందరూ చాలా రోజులు తనని ఏడిపించేవారు. ఆ మధుర స్మృతులు గుర్తొచ్చి అప్రయత్నంగా తన పెదాలపై చిరునవ్వు విరిసింది.

ఆరోజు రాత్రి ఇంటికెళ్ళి వేడి నీళ్ళు పోసుకొని హరిణి వండిన వేడి వేడి అన్నం, బంగాళ దుంపల వేపుడు, అవకాయ తింటుంటే స్వర్గంలో విహరించినట్టుంది రాధికకి. ఆ రోజు రాత్రి పక్కలు సరదాగా డాబా మీద వెన్నెల్లో అరెంజ్ చేశారు. కాసేపు కబుర్లాడుకొని నెమ్మదిగా నిద్రలోకి జారుకొన్నారంతా. రాధిక మాత్రం ఆలోచనలలోకి జారుకొంటుంటే అనిపించసాగింది హరిణి జీవితం ఇంత ఆనందంగా ఎందుకున్నదో, తన జీవితంలో అంత నైరాశ్యం ఎందుకు అలముకొన్నదో. తనకీ అన్నీ ఉన్నా ఆనందించడం చేత కాదు. స్త్రీ తన కాళ్ళ మీద తాను నిలబడి తనకంటూ ఓ జీవితాన్ని ఏర్పరచుకొంటేనే ఈ సమాజంలో మగవాడి ఆధిపత్యానికి గండి కొట్టగలుగుతుంది అని అనుకొంది. ఆనాటి తన భావాలను అభినందించే శ్రీహర్షకి దగ్గరయ్యింది.

శ్రీహర్ష కూడా ఆమెలోని స్వతంత్ర, ఆధునిక భావాల వైపు ఆకర్షితుడైనాడని అనుకొంది కానీ అతను ఆకర్షితుడైంది ఆమెలోని అందానికి అని పెళ్ళైన కొన్నాళ్ళకే తెలిసిందిద్దరికీ. పెళ్ళాం అందం పట్ల ఆకర్షణ తగ్గగానే ఆమె ఆలోచనలు, భావాలు అతనికి విప్లవ భావాలుగా, పొగరుబోతుతనంగా కనిపించేవి. వీటిపైనే తరచూ గొడవలు జరిగేవి. భర్తకి అనుకూలంగా ఉండటం, భర్త ముందు ఓడిపోవడం లాంటిదే కనిపించేదే అనుకొనేది రాధిక. దాంతో పాటు ఆమె తల్లిదండ్రుల ప్రవర్తన, ఆ సొసైటీ పిల్లలని ఓ పద్ధతి లేకుండా పెరిగేలా చేశాయి. రాధికకి ఒక్కొక్క విషయంలోనూ తేడా స్పష్టంగా కనిపించసాగింది. మొదటిసారిగా తన ఈ జీవితానికి కారణం తన ఈ ప్రవర్తనేనా అని కూడా అనిపించింది. మించిపోయింది లేదు. ఇప్పటికైనా తన జీవితాన్ని తాను దిద్దుకోవచ్చునిపించింది. మరునాడు ఉదయం ఏడు గంటలకే లేచింది. తనూ స్నానం చేసి హరిణితో పూజలో పాల్గొంది. ఆ రోజు టిఫిన్‌లోను, వంటలోనూ తానూ సహాయం చేసింది. తను రాత్రి తీసుకొన్న నిర్ణయంతో ఆరోజు ఓ కొత్త రోజులా గడిచింది రాధికకి.

ఆ రోజు సాయంత్రం విశాఖ రైల్వే స్టేషన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో కూర్చొని ఉంది రాధిక. హరిణి కుటుంబంతో సహా వచ్చింది స్నేహితురాలికి వీడ్కోలు చెప్పడానికి, ఇంటి నుండి బయలుదేరేటప్పుడు పసుపు, కుంకుమతో పాటు స్నేహితురాలికి చీర, రవిక పెట్టింది హరిణి. ట్రైన్‌లో రాత్రి తినడానికి వేడి వేడి పూరీలు, ఆలూ కూరని వేడి పోనిపేపర్‌లో నీట్‌గా ప్యాక్ చేసి ఇచ్చింది హరిణి. అనన్య తమ దొడ్లో పూచిన అందమైన గులాబీ పువ్వుని తన స్వచ్ఛమైన నవ్వుతో కలిపి అందించింది. అనన్యని దగ్గరకు తీసుకొని నుదుటిపై ముద్దు పెట్టుకొంది రాధిక. తేజా తను ముందు రోజు పిక్నిక్‌లో గీసిన డ్రాయింగ్‌ని గిఫ్ట్‌గా ఇచ్చాడు. అది హరిణి కుటుంబంతో కలిసి ఉన్న రాధిక డ్రాయింగ్. జీవం ఉట్టిపడుతోన్న ఆ బొమ్మని, వాడిలోని నైపుణ్యాన్ని ఎంత మెచ్చుకొన్నా అది తక్కువే అనిపించింది. మినరల్ వాటర్ బాటిల్‌తో వచ్చిన నివాస్ 'మీకు నా నుండి ఈ చిన్న గిఫ్ట్' అంటూ 'అందమైన జీవితం' అన్న పుస్తకాన్ని ఇచ్చాడు. అంతకు ముందు ఓసారి మాటల మధ్యలో పుస్తకాల టాపిక్ వచ్చినప్పుడు జీవితాన్ని ఎన్ని రకాలుగా ఆనందించవచ్చో తెలిపే ఆ పుస్తకాన్ని గురించి నివాస్ చెప్పినప్పుడు తను ఆసక్తి కనబరచడాన్ని అతను గమనించినట్టున్నాడు అనుకొంది. ''థాంక్స్'' అని చెప్పింది కృతజ్ఞతాపూర్వకంగా అతని వైపు చూస్తూ.

''ఆయన ఎవరికైనా సరే ఇలా పుస్తకాలు బహుమతులుగా ఇస్తుంటారు'' అంది నవ్వుతూ హరిణి.

''అన్నట్లు ఆయన నీకు ఇంకో గిఫ్ట్ కూడా తెచ్చారే. ఇవ్వడం మరిచాను'' అని హ్యాండ్ బ్యాగ్‌లో నుండి గిఫ్ట్ ర్యాపర్ చుట్టిన ఓ చిన్న గిఫ్ట్‌ని ఇచ్చింది. ఆశ్చర్యంగా చూస్తోన్న రాధికతో ''నీకిష్టమని కిషోర్ కుమార్ పాటల క్యాసెట్'' అంటూ కొంటెగా రాధిక మొహంలో చూసింది హరిణి. అంతే ఒక్క క్షణం స్నేహితురాళ్ళిద్దరూ కాలేజీ రోజుల్లో జరిగిన సంఘటనని తలచుకొని ఒకటే నవ్వుకొన్నారు. ఆ నవ్వు వారిద్దరికే అర్థమవుతుంది.

ఇకపై రాధిక జీవితంలో నవ్వులకు కొదవుండదు అనే ఆశావాహ దృక్పథంతోనే స్నేహితురాలికి వీడ్కోలు చెప్పింది హరిణి.

☆

